క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



విద్యా సామగ్రి అందజేస్తున్న ఎంఈఓ ప్రేమలత

ఏర్పేడు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఎంఈఓ ప్రేమలత అన్నారు. బుధవారం మండలంలోని పోతుమానిగుంట ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో దిసమ్ దాసని ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల బోధన ఉంటుందన్నారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలని తెలిపారు. ఉపాధ్యాయులు గ్రామాల్లో బడిఈడు పిల్లలను గుర్తించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరరావు, సీఆర్పీ మునీశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



సురేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీలత

శ్రీకాళహస్తి: ఐఐటీ జేఏఎం 2024లో ఉత్తీర్ణత సాధించిన పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల బీఎస్సీ ఎంపీసీ మూడవ సంవత్సరం విద్యార్థి టి.సురేష్‌ను బుధవారం అధ్యాపక సిబ్బంది అభినందించారు. ఇటీవల జరిగిన కౌన్సెలింగ్‌లో తిరుపతి ఐఐటీలో రసాయనశాస్త్రం విద్యను అభ్యసించే అవకాశం వచ్చింది. ఈ నేపథ్యంలో సురేష్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థి విజయం కళాశాల మొత్తానికి గర్వకారణమన్నారు. అనంతరం రూ. 5వేలు నగదు బహుమతిని అందజేశారు. అధ్యాపకులు రమేష్‌బాబు, పరంధామయ్య, బాపనయ్య, సాయి వెంకటేష్, తులసి, సునీత, గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.

ముళ్లకంపల తొలగింపు



పాల్గొన్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని క్రీడా మైదానంలో బుధవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిచ్చిమొక్కలు, ముళ్లకంపలను జేసీబీ సాయంతో తొలగించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనతో వీటిని తొలగించినట్లు వారు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జ్వరంతో విద్యార్థి మృతి



చరణ్‌కుమార్ (ఫైల్)

తొట్టంబేడు : శ్రీకాళహస్తి మండలం వెంకటాపురంలో బుధవారం జ్వరంతో విద్యార్థి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు వెంకటాపురం గ్రామానికి చెందిన చెవిరెడ్డి, మమత దంపతుల కుమారుడు చరణ్‌కుమార్(11) ఎగువవీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. వారం రోజుల కిందట టైఫాయిడ్ జ్వరం సోకడంతో, తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ చరణ్ బుధవారం మృతిచెందాడు. చరణ్ మృతిపట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

వేడుకగా పానగల్ గంగమ్మ జాతర

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్‌లో గంగమ్మ జాతర వేడుకగా జరిగింది. ఆదివారం చాటింపుతో జాతర ప్రారంభమైంది. బుధవారం వేకువజామున అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయం వద్ద నుంచి హౌసింగ్ బోర్డు కాలనీ వరకు అమ్మవారి ఊరేగింపు జరిగింది. అనంతరం అమ్మవారిని కొలువుదీర్చారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి అమ్మవారి నిమజ్జనం ప్రశాంతంగాజరిగింది.

అధిక ధరలకు పుస్తకాల విక్రయం

నాయుడుపేట టౌన్ : ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు చేపట్టాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. వారు బుధవారం ఎమ్మార్వో వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రయివేటు యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. అనంతరం ఎంఈవో మునిరత్నంకు వినతి పత్రం అందజేశారు. నాయకులు తడుకు చందు, వినయ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర జీవనోపాధుల కల్పనే లక్ష్యం



మాట్లాడుతున్న సెర్ప్ లైవ్లీహుడ్స్ డైరెక్టర్ పద్మావతి

తొట్టంబేడు : మహిళలకు సుస్థిర జీవనోపాధుల కల్పనే లక్ష్యంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సెర్ప్ లైవ్లీహుడ్స్ డైరెక్టర్ పద్మావతి అన్నారు. శ్రీకాళహస్తి మండల వెలుగు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గం పరిధిలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల ఏపీఎంలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌వీఈపీ రుణాలను వందశాతం రికవరీ చేసి, వాటిని సుస్థిర జీవనోపాధుల కల్పనకు అవసరమైన రుణాలను మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళా సభ్యులు వ్యాపారాలు ప్రారంభించేందుకు, విస్తరించేందుకు పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ, స్త్రీనిధి, ఉన్నతి బ్యాంకుల ద్వారా రుణాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి మండలం నుంచి ఆగస్టు మొదటి వారంలోపు వంద మందికి తక్కువ కాకుండా మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలని సిబ్బందికి తెలిపారు. సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని డైరెక్టర్ పద్మావతి సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, సెర్ప్ ఎఫ్‌పీవో డీపీఎం శ్రీనివాసులు, పీఈ శేఖర్, జిల్లా స్త్రీనిధి ఏజీఎం హేమంత్‌కుమార్, ఎఫ్‌పీవో ఏపీఎంలు సింగన్న, ఆదినారాయణ, ఏసీ ధనంజయరెడ్డి, ఏపీఎంలు మునెయ్య, గురుమూర్తి, పళని, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

సాక్షి ఎఫెక్ట్..



సూచనలిస్తున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సమయ పాలన పట్టించుకోకుంటే చర్యలు తప్పవని ఎంఈఓ రవీంద్రనాథ్ హెచ్చరించారు. బుధవారం 'సమయ పాలన గాలికి' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. బుధవారం తహానగర్ గ్రామ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. సమయపాలన పట్టని ఉపాధ్యాయుడు విఠల్‌కుమార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. మరోసారి ఇలా జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని తెలిపారు.

ఉపాధి పనులు వేగవంతం

ఏర్పేడు: ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ గిడ్డయ్య అన్నారు. బుధవారం మండల ఉపాధిహామీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో వంద మంది కూలీలు తగ్గకుండా చూడాలన్నారు. గ్రామాభివృద్ధికి దోహదపడే పనులను చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాల పెంపునకు నీటిగుంతలను ఏర్పాటు చేయాలన్నారు. ఏపీఓ దేవరి, జేఈ బాలాజీ, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామికి అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భజనలు చేశారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే జైలుకే



రేణిగుంటలో మందుబాబుల స్థావరాలను శుభ్రం చేయిస్తున్న సీఐ మల్లికార్జున



వరదయ్యపాళెం: శ్రీసిటీ పరిసరాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్

రేణిగుంట: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని రేణిగుంట అర్బన్ సీఐ మల్లికార్జున హెచ్చరించారు. రేణిగుంటలో మందుబాబులు ఉండే ప్రదేశాలను గుర్తించి అక్కడికి సిబ్బందితో కలసి బుధవారం సీఐ చేరుకున్నారు. అక్కడ మద్యం తాగి పడేసిన బాటిళ్లు, వ్యర్థాలను పంచాయితీ పారిశుద్ధ్య సిబ్బంది సాయంతో శుభ్రం చేయించారు. కొంతమంది బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతూ న్యూసెన్స్ సృష్టిస్తున్నారని తమకు ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో ఈనెలలోనే అలాంటి 50 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎస్ఐలు అరుణ్‌కుమార్‌రెడ్డి, జావేద్‌బాషా పాల్గొన్నారు.

కేసులు తప్పవు

వరదయ్యపాళెం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని, నిబంధనలను అతిక్రమిస్తే మందుబాబులపై కేసులు తప్పవని శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం ఆయన సిబ్బందితో కలసి శ్రీసిటీ పరిసర ప్రాంతాలైన మత్తేరిమిట్ట, చిలమత్తూరు, చిన్న పాండూరు, చెంగంబాకం ప్రాంతాల్లో పర్యటించి తాగుబోతులు మద్యం సేవించే బహిరంగ ప్రదేశాలను గుర్తించారు. అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. డీఎస్పీ మాట్లాడుతూ రోజూ ఎస్ఐలు, సీఐలు ఆయా ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తారని, ఆ సమయంలో మద్యం సేవిస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట సీఐ భాస్కరరావు, ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ దయానిధి నాయుడు ఉన్నారు.

కండలేరులో 6.410 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 6.410 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు



ప్రాకారోత్సవంలో పాల్గొన్న భక్తులు

నాగలాపురం: సురుటుపళిలోని ప్రసిద్ధ శ్రీపళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో బుధవారం త్రయోదశి సందర్భంగా ప్రదోష పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తుల రద్దీ సాగింది. సాయం సంధ్య వేళ ప్రదోష పూజలు వేదోక్తంగా ప్రారంభమ య్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుకుల్, సతీష్ శర్మ, గణేష్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలోని నందీశ్వరస్వామికి, శ్రీవాల్మీకేశ్వరస్వామికి ఏక కాలంలో వివిధ రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించి దీపధూపనైవేద్యాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. తమిళనాడు నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఓం నమశ్శివాయ నామస్మరణలు మిన్నంటాయి. ఊత్తుకోట్టై తాలూకా పోందవాక్కం గ్రామానికి చెందిన ఎస్‌బీ హరి కుటుంబ సభ్యులు ఉభదారులుగా వ్యవహరించారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి కె.రామచంద్ర రెడ్డి, పాలక మండలి సభ్యుడు ఆనందయ్య, సిబ్బంది శరవణ, పరందామరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో పల్లకిపై స్వామివారిని కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యాహక్కు చట్ట ప్రకారం బడిఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని, తప్పనిసరిగా బడిలో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం ఆయన ఉపాధ్యాయుడు రామచంద్రయ్యతో కలసి కాంపాళ్లెం గిరిజన కాలనీలో పర్యటించారు. బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపించాలని, అడ్మిషన్ చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటుగా ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు అందించడంతో పాటు రుచికరమైన పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు.

పుత్తూరు- సత్యవేడు బస్సు నడపండి



పుత్తూరు ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణవనం: పుత్తూరు నుంచి సత్యవేడు వరకు ఉదయం బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. బుధవారం సాయంత్రం పీఆర్‌టీయూ నాయకులు ఎమ్మెల్యే ఆదిమూలంను కలిశారు. ఉదయం పుత్తూరు నుంచి సత్యవేడు వరకు వెళ్లే ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు బస్సు సౌకర్యం లేక పలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఉదయం 7.30 గంటలకు పుత్తూరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సును సత్యవేడు వరకు నడపాలని పుత్తూరు డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి చెప్పారు. సిఫారస్సు లేఖను కూడా ఇచ్చారు. అనంతరం పుత్తూరు ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్‌ను కలిసి నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శులు సదాశివన్, జోగి గురుమూర్తి యాదవ్, నారాయణవనం, నింద్ర, పిచ్చాటూరు మండలాల నాయకులు పాల్గొన్నారు.

పాహిమాం పోలేరమ్మతల్లి





కుమ్మరి ఇంట వద్ద కొలువుదీరిన పోలేరమ్మ, ప్రత్యేక పూల అలంకరణలో అమ్మవారి ఆలయం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని బంగారుపేటలో పోలేరమ్మ జాతర అంతరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా కుమ్మరి వీధిలో అమ్మవారి ప్రతిమను తయారు చేసి భక్తుల దర్శనార్థం ఉంచారు. అనంతరం సంప్రదాయ బద్ధంగా అమ్మవారిని మెట్టినిల్లు అయిన రజక నివాసం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారిని కల్లు, దిష్టి చుక్కతో అలంకరించి ప్రత్యేక పూల వాహనంలో కొలువుదీర్చి అశేష జన సందోహం మధ్య ఆలయం వద్దకు తీసుకువచ్చారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అమ్మవారి జాతరలో భాగంగా బంగారుపేట చావడి వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కేరళ వాయిద్యాలు, ప్రత్యేక వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు. మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు, ఇతర దేశాల్లో స్థిర పడిన స్థానికులు జాతర సందర్భంగా స్వగ్రామాలకు చేరుకున్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వెంకటగిరి సీఐ సంగమేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కళాకారుల కేరళ నృత్యాలు





సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాకారులు, ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాలంకరణ

అనీమియా వ్యాధిపై అవగాహన



చెన్నేరిలో వైద్య సిబ్బంది ర్యాలీ

వరదయ్యపాళెం: సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. వైద్యాధికారులు ఉదయ్‌కుమార్, ద్వైతల ఆధ్వర్యంలో ఇందిరానగర్, మరదవాడ, వరదయ్యపాళెం, సంతవేలూరు, కదూరు విలేజ్ క్లినిక్‌ల వద్ద అనీమియా వ్యాధి లక్షణాలు, నివారణపై అవగాహన కల్పించారు. ప్రధానంగా రక్తహీనత, కళ్లు పసుపు రంగులో మారడం, తీవ్ర ఒళ్లునొప్పులు, కీళ్లనొప్పులు రావడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడం, అలసటగా ఉండడం వంటివి అనీమియా వ్యాధి లక్షణాలని వైద్యులు సూచించారు. సీహెచ్‌ఓ మధుసూదన్, పీహెచ్‌ఎన్ తులసమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నేరిలో ..

సత్యవేడు: మండలంలోని దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి బి. మురళీకృష్ణ ఆధ్వర్యంలో చెన్నేరిలో బుధవారం గ్రామస్తులకు సికిల్‌సెల్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రపంచ సికిల్‌సెల్ వ్యాధి అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని తొలుత అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈ వ్యాధి జన్యు సంబంధమైందని, ప్రాణాంతకమని తెలిపారు. ఈ వ్యాధి ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో వ్యాపిస్తుందన్నారు. ఈ వ్యాధి ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, ఆరోగ్య పర్యవేక్షకురాలు వి. నాగజ్యోతి, సిబ్బంది పార్వతి, వనజాక్షి, భార్గవి, సరస్వతి, జాస్మిరాణి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అనీమియా వ్యాధి టెస్టులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ఈబీసీ కాలనీలోని గిరిజనులకు బుధవారం సర్పంచ్ వెంకటమ్మ, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉపసర్పంచ్ మునిరాజ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సికిల్ సెల్ అనీమియా వ్యాధిని గుర్తించడం కోసం వైద్య పరీక్షలు చేసి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా జీవిత కాల వ్యాధి అని, రక్తంలో ఎర్ర రక్త కణాలలో వృత్తాకార బిళ్లల రూపంలో ఉంటాయన్నారు. ఈ వ్యాధితో రక్త ప్రసరం తగ్గుతుందని, దీంతో స్ట్రోక్, కంటి సమస్యలు, ఆర్గానిక్స్ దెబ్బతింటాయని తెలిపారు. గిరిజనులు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతుండడంతో వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ప్రాథమిక దశలోనే గుర్తించాలి

తొట్టంబేడు : సికిల్ సెల్ అనిమియాపై అవగాహన అవసరమని కాసరం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని కాసరం పీహెచ్‌సీ పరిధిలోని పిల్లమేడులో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సుమారు 10 లక్షల మంది సికిల్ సెల్ అనిమియాతో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యం అందిస్తే నివారించవచ్చని తెలిపారు. ఎంపీహెచ్‌ఈవో బాషా, పీహెచ్‌ఎన్ గౌరి, హెల్త్ సూపర్‌వైజర్ అమ్మణ్ణమ్మ, ఆరోగ్యకార్యకర్త సురేఖ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వరదయ్యపాళెంలో సూచనలిస్తున్న వైద్యాధికారి ద్వైత



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ప్రకృతి వ్యవసాయ విధానాలు భేష్

తిరుపతి రూరల్: తిరుపతి ప్రాంతంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు భేషుగ్గా ఉన్నాయని సెర్ప్ రాష్ట్ర డైరెక్టర్ పద్మావతి కొనియాడారు. తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామంలో దామా అయ్యప్పనాయుడు వ్యవసాయ క్షేత్రంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను బుధవారం ఆమె సందర్శించారు. వర్మికంపోస్ట్ తయారీ, పట్టుపరిశ్రమ, మామిడి, పీఎండీఎస్ విధానాలపై ఆయన అవలంబిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను అడిగి తెలుసుకున్నారు. తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయంతో ఎంత ఆదాయాలను ఆర్జిస్తున్నారు అనే అంశాలపై ఆరా తీశారు. డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, శ్రీనివాస్, అ య్యప్పనాయుడు, ధనంజయరెడ్డి, ఏపీఎం ఆదినారాయణ, అధికారులు పాల్గొన్నారు.